క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం వారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎస్ఎస్ఏ పరిధిలో, విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సీఆర్ఎంటీఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్స్‌లతోపాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు భాస్కర్, మదన్, పెంచలయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల అవసరాల కోసం దాచుకున్న పొదుపు సొమ్మును చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. సంబంధిత బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ బుధవారం సాయంత్రం కడప తహశీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎజాస్ అహ్మద్, సివి రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పునీత యోహాను మహోత్సవం



దైవ సందేశం అందజేస్తున్న విచారణ గురువు దేవ సహాయం

కడప కల్చరల్ : విచారణ పాలక పునీతులు యోహాను మహోత్సవం బుధవారం స్థానిక మాసాపేటలోని పునీత యోహాను చర్చిలో ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు గుడిమె దేవ సహాయం ఆధ్వర్యంలో దివ్యబలిపూజ సమర్పించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కడప డీన్, ఆరోగ్య మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్, రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రియ శిష్యులలో యోహాను ముఖ్యుడన్నారు. దేవుడు మనలను ప్రేమించినట్టు మనం కూడా ఒకరి పట్ల ఒకరు ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవ ఫాదర్ ఆరోగ్యస్వామి, రెవ ఫాదర్ పాల బాలస్వామి, సగిలి ప్రవీణ్, జెయంజె సిస్టర్లు, శాంతి సేవ సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, జార్జి, చర్చిసంఘ పెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

31న ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : రెడ్డి సేవా సమితి కడపశాఖ ఆధ్వర్యంలో ఈనెల 31న ముగ్గుల పోటీ నిర్వహించనున్నామని సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాలు 2024 పేరిట గ్రామీణ క్రీడలు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఇప్పటికే స్త్రీ, పురుషుల కబడ్డీ, కోలాటం, చెక్కభజన, కర్రసాము, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించామన్నారు. కాగా ఈనెల 31న ఎర్రముక్కపల్లెలోని శివశివానీ స్కూలు మైదానంలో స్త్రీలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. గంట సమయంలో 4.5 అడుగుల పొడవు, వెడల్పులో ముగ్గు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ. 10,000, రూ. 7500, రూ. 5000తోపాటు ఐదుగురికి చీరలను బహుమతిగా ఇస్తామన్నారు. జనవరి 7న బండలాగుడు పోటీ నిర్వహిస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. లక్ష, ద్వితీయ బహుమతి రూ. 75,000, తృతీయ బహుమతి రూ. 50,000, ఆ తర్వాత రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు బహుమతులు ఇస్తామన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి ఎద్దుల యజమానులకు రూ. 5 వేల ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు.

4 నుంచి కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు : అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు కడపలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ.5వేలు ఇస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని, ప్రథమ బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.50వేలు ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 63012 25355కు సంప్రదించాలని కోరారు.

కళాత్మక నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య
- ఐదురోజుల ఫైన్‌ఆర్ట్స్ వర్క్‌షాప్ ప్రారంభం



చిత్రాలు గీస్తున్న లలితకళల విభాగం విద్యార్థులు

వైవీయూ : కుడ్య చిత్రకారుల కళాత్మక నైపుణ్యాలకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అన్నారు. వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో ×జీవన సంప్రదాయాలు× మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదురోజుల వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ కుడ్యచిత్రాలతో పబ్లిక్ లేదా ప్రైవేట్ రంగాలలో అవకాశాలు ఉన్నాయన్నారు. చారిత్రక సంఘటనను స్మారకంగా రికార్డు చేయడానికి ఇవి దోహదం చేస్తాయన్నారు. వర్క్‌షాపులో నిపుణుల మార్గదర్శకం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ 15వ శతాబ్దం నుంచి నేటి వరకు చిత్రకళ అభివృద్ధి గురించి ఆమె క్లుప్తంగా వివరించారు. చిత్రకళ ఎంతో ఆకర్షణీయమైందన్నారు. ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వర్క్‌షాప్ ద్వారా కుడ్యచిత్రాలు ఆర్ట్స్‌బ్లాక్‌కు సరికొత్త శోభను తీసుకువస్తాయన్నారు. వర్క్‌షాప్ సంచాలకులు డాక్టర్ కె. మృత్యుంజయరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ ఉద్దేశ్యాన్ని వివరించారు. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ప్రయోగాత్మక విద్యలో భాగంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఓఎస్ చైర్మన్ ఆచార్య ఎం.ఎం. వినోదిని మాట్లాడుతూ రంగులు, చిత్రాలు ఒక కొత్త లోకానికి తీసుకువెళతాయని విశ్లేషించారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లుగా విచ్చేసిన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. సంతోష్‌కుమార్, వైజాగ్‌కు చెందిన సమకాలిన కళాకారుడు రవి కుడ్యచిత్రాలపై ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు వెంకటేష్, బి.చినరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి పాల్గొన్నారు.

హరిప్రసాద్ నోరు అదుపులో పెట్టుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బలిజ నాయకులు

కడప కార్పొరేషన్: టీడీపీ నేత హరిప్రసాద్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలిజ నాయకులు హెచ్చరించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బలిజ నేతలు నారాయణస్వామి రాయల్, ఎస్వీ రాము, తోట క్రిష్ణ, సుదర్శన్ రాయల్ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలిజలకు ఏం మేలు చేసింది, ఎంతమందికి పదవులు ఇచ్చిందనే దానిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

రాష్ట్రంలో, జిల్లాలో బలిజలకు మేలు చేసింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బలిజలకు చేసిన న్యాయం ఏమిటో అందరికీ తెలుసని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఎన్నికలకు రెండు రోజుల ముందు టీడీపీ నేత హరిప్రసాద్‌కు అడా చైర్మన్ పదవి ఇచ్చారని కనీసం కుర్చీలో కూడా కూర్చునే అవకాశం లేకుండా చేశారన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నేత దుర్గాప్రసాద్ పోటీ చేస్తే పార్టీని ధిక్కరించారంటూ సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బలిజ నాయకుడు సింగసాని గురుమోహన్‌ను కుడా చైర్మన్ చేశారని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో బలిజలకు ఎలాంటి స్థానం లేదని, కేవలం రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కడప నగరంలోని కృష్ణ సర్కిల్ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు చెన్నంశెట్టి మురళి, బండారు సత్యనారాయణ, శివ కేశవ, బండి నరసింహాబాబు, కేకే కృష్ణ హరి, రాధాకృష్ణ, మల్లేశ్వరి, నరసింహులు, పసుపులేటి భద్రుడు, వెంకట సుబ్బయ్య, వెంకటేష్, జి రఘు, సాంబయ్య, మాజీ కౌన్సిలర్ ఉమామహేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు పత్తి రాజేశ్వరి, కార్పొరేటర్లు రెడ్డి ప్రసాద్, మల్లికార్జున, కిరణ్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగాడివీధికి చెందిన పఠాన్ షాషా (18) అనే యువకుడు ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదనీ అతని తల్లి పఠాన్ షాహినా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పఠాన్ షాబుద్దీన్, షాహినాకు ముగ్గురు కుమారులు వున్నారు. వారి రెండవ కుమారుడు తన స్నేహితులతో కలిసి ఈనెల 22వ తేదీన తాడిపత్రికి వెళ్లి వచ్చాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తల్లి మందలించింది. తరువాత రోజున ఇంటిలో ఎవరూలేని సమయంలో, ఎవరికీ చెప్పకుండానే వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని తల్లిదండ్రులు, బంధువులు యువకుడి ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్టా కార్యక్రమం

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ధ్వజస్తంభ పునఃప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం కళశ ఆరాధన, మూర్తీశ్వర, మూల మంత్ర హోమాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : ప్రజా సమస్యల పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం తగదని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధి హామీ, వెలుగు, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, పీఆర్, ట్రాన్స్‌కో, హౌసింగ్, వైద్య, పశు సంవర్ధక తదితర శాఖల అధికారులు తమ శాఖ ద్వారా జరిగిన అభివృద్ధిని నివేదికల ద్వారా చదివి వినిపించారు. అయితే విద్యుత్ సమస్యలు అధికంగా ఉండటంతో ప్రసాద్‌రెడ్డి ఆ శాఖ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. తమ మండలానికి అవసరమైన విద్యుత్ స్తంభాలతో పాటు అందుకు అవసరమైన సామగ్రి తక్షణం మంజూరు చేయాలని ఆయన కోరారు. సామగ్రి వచ్చిన తక్షణం అన్ని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో ఉన్న ఏఈ చాంద్‌బాషాకు సూచించారు. అలాగే త్వరలో ఎన్నికలు వస్తాయని, ఆ లోపు ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించవద్దని, సమస్యలు మీ దృష్టికి రాగానే వాటిని పరిష్కరించాలన్నారు. ఎంపీపీ భారతి మాట్లాడుతూ మండల సమావేశాలకు వచ్చే సమయంలో మీరు నివేదికలతో రావాలన్నారు. ఆ పత్రులను అందరికి ఇవ్వాలన్నారు. సమావేశంలో నోటి ద్వారా చెబితే ప్రయోజనం ఉండదన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శివనాగరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సర్కిల్ అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ శివనాగరాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోస్టల్ కార్యాలయంలోని పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఫైళ్లను తనిఖీ చేశారు. అనంతరం చిన్న మొత్తాల పొదుపుపై ఏజెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చేర్పించేలా కృషి చేయాలన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ జి.రాజేష్, ఏఎస్పీలు భాస్కర్ రెడ్డి, రెడ్డిబాష, సర్కిల్ పీఎల్ఐ ప్రాజెక్టు మేనేజర్ అచ్యుత్ కుమా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : పరిశ్రమల్లో, కర్మాగారాల్లో అనుకోకుండా జరిగే రసాయన పదార్థాల ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రైసెస్ గ్రూప్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు తరచూ కర్మాగారాలను తనిఖీ చేస్తూ మ్యాపింగ్ చేయాలని, వాటిలో ఎంత మేర రసాయన పదార్థాలు వినియోగించాలి, సంబంధిత యాజమాన్యాలు ఎంత మేర రసాయన పదార్థాలు వినియోగిస్తున్నారో తనిఖీ చేయాలన్నారు. అలాగే ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఎక్కడైనా లోపాలు ఉంటే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఆయా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సంబంధించిన మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తూ ప్రజలకు, కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలించాకే సంబంధిత కర్మాగారాలకు లైసెన్స్‌లు మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో కర్మాగారాల ఉప ప్రధాన తనిఖీ అధికారి కె.క్రిష్ణమూర్తి, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, అర్బన్ సీఐ యుగంధర్, ఎంపీడీఓ నూర్జహాన్, బి.మఠం ఈఓపీఆర్‌డీ జానకిదేవి, ఫైర్‌ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామికి నూతన ఆలయం

– నేటి నుంచి పనులు ప్రారంభం



నూతన ఆలయం నిర్మించనున్న ప్రాంతం

కడప కల్చరల్ : కడప నగరంలోని మృత్యుంజయ కుంటలోగల శ్రీ మృత్యుంజయేశ్వరస్వామికి నూతన ఆలయం నిర్మాణం కానుంది. దీనికి సంబంధించిన పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, దేవదాయశాఖ అధికారులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటి వరకు ఉన్న ఆలయం వెనుకగల మైదానంలో నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు.

– కాగా 2010 నుంచి నూతన ఆలయం నిర్మించే ప్రయత్నాలు సాగాయి. నాటి నగర మేయర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నూతన ఆలయ నిర్మాణాన్ని తలపెట్టారు. రూ. 65 లక్షల బడ్జెట్‌ను మంజూరు చేయించారు. తొలి విడతగా రూ. 20 లక్షల పనులు జరిగాయి. ఇప్పుడున్న ఆలయానికి సరిగ్గా వెనుక విశాలమైన ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. ప్రభుత్వాలు మారడంతో ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. 2017లో మేయర్ సురేష్ బాబు ఆలయ పనులపై దృష్టి సారించారు. మంజూరైన నిధులలో ఖర్చు చేసిందిపోగా మిగతా సొమ్మును విడుదల చేయించేందుకు రాష్ట్ర దేవదాయశాఖ అధికారులను సంప్రదించి అనుమతులు సాధించారు. దీంతో ప్రస్తుతం రూ. 40 లక్షలతో మిగతా పనులు చేసేందుకు రంగం సిద్ధమైంది.

మహాసభను జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు దొప్పలపూడి ఈశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం ఈ మేరకు కడప నగరపాలక సంస్థలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కోసం జనవరి 7 వ తేదీన విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి మహాసభ ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథ్ రెడ్డి, నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ షకీల్ అహ్మద్, జనరల్ సెక్రెటరీ రవిబాబు, ట్రెజరర్ లూకరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

– జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా జేసీ జి.గణేష్ కుమార్



వినతులను జేసీకి అందిస్తున్న అర్జీదారులు

ఒంటిమిట్ట : మండల స్థాయిలో జరిగే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో ఆర్జీదారులకు సంతృప్తి కలిగే పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన జేసీ జి.గణేష్ కుమార్ మండల ప్రజల వద్ద నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలు మండల స్థాయిలో స్థానికంగా పరిష్కారం కావాలనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తుందన్నారు. ప్రజల నుంచి వినతులు మండల స్థాయిలోనే త్వరగా పరిష్కారం అయ్యేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిబ్బంది ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోక కళ్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కళ్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సమాయత్తం కావాలి

మైదుకూరు : లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, సమగ్రాభివృద్ధి కోసం పార్టీ శ్రేణులు ప్రజా పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీసీఎల్ కల్యాణ మండపంలో సీపీఐ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చిందని ఆరోపించారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు, హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరుస్తూ చట్టాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ చివరకు మన విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేయడానికి పూనుకున్నారని అన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు కేటాయించడంలో, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, మైదుకూరు నియోజకవర్గ నాయకుడు పి.శ్రీరాములు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే కాంపిటీషన్స్‌కు అలవాటు పడాలి



మాట్లాడుతున్న కడప అకడమిక్ ఎంఈఓ ఇర్షాద్ అహమ్మద్

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కాంపిటీషన్స్‌కు అలవాటు పడాలని కడప మండల అకడమిక్ ఎంఈఓ ఇర్షాద్ ఆహమ్మద్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో జిల్లాస్థాయి కన్స్యూమన్ ఫోరంకు సంబంధించి వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే చదువుతోపాటు అన్ని విభాగాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. దీంతోపాటు అన్ని పోటీ పరీక్షల్లో కూడా రాణించేలా సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10: 30 గంటలకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం, ప్రజా పంపిణీ నిర్వహణ, విద్య మొదలైన అంశాలను గురించి చర్చిస్తారన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు



జేసీబీతో ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే దారితోపాటు పంట పొలాలకు వెళ్లే దారుల వెంబడి ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి దృష్టికి స్థానికులు సమస్యను తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులను వెచ్చించి స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతల ఆధ్వర్యంలో జేసీబీతో ఆ దారుల వెంబడి వున్న ముళ్ల పొదలను తొలగించారు. గుంతలమయంగా వున్న దారిలో గుంతలను చదును చేసి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నాగనాథీశ్వరుని కొండ అభివృద్ధికి కృషి

ఖాజీపేట : నాగనాథీశ్వర కొండ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మైదుకూరు నియోజక వర్గ సమన్వయ కర్త శెట్టి పల్లి నాగిరెడ్డి అన్నారు. నాగనాథీశ్వర కొండ చైర్మన్‌గా గుమ్మ నాగలక్ష్మిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ఆలయం కొండ పై 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. అందుకు తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి



మత్స్య సహకార సంఘం సభ్యులకు రుణ అర్హత పత్రాలు అందజేస్తున్న అధికారులు

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఆఫ్ మెరైన్ ఇంజినీర్ కె.మణిమారన్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎ.కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక దర్గావీధిలోని హుస్సేన్‌పీర్ దర్గా ఆవరణలో నిర్వహించిన మత్స్య సహకార సంఘం సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు కిసాన్ క్రెడిట్ కార్డును అందజేసి వారికి 40 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మత్స్యకారుల జీవితాలు మరింత మెరుగు పడనున్నాయని అన్నారు. సమావేశంలో మత్స్య సహాయకులు వై.కొండయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మిరప్పల్లెవెంకటరమణ, ఉపాధ్యక్షులు చింతలనాగేంద్రరావు, కార్యదర్శి గగ్గెరవెంకటయ్య, డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.